దుబ్బాక ఎమ్మెల్యే కాన్వాయ్ వెళ్తుండగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దుబ్బాక ఎమ్మెల్యే కారుపై కాంగ్రెస్ దాడి

- నియోజకవర్గంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేను అడ్డుకునే యత్నం
- బీఆర్ఎస్ శ్రేణులు ప్రతిఘటించడంతో ఉద్రిక్తత
- వాహనంపైకి కోడిగుడ్లు విసిరిన కాంగ్రెస్ శ్రేణులు
- డైవర్షన్ రాజకీయాలు మాని పాలనపై దృష్టిపెట్టాలన్న ఎమ్మెల్యే

దుబ్బాక, అక్టోబర్ 3: సిద్దిపేట జిల్లా దుబ్బాకలో గురువారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటనను అడ్డుకునేందుకు కాంగ్రెస్ నాయకులు అత్యుత్సాహం చూపించారు. వారిని బీఆర్ఎస్ శ్రేణులు నిలువరించడంతో ఉద్రిక్తత నెలకొంది. పట్టణంలోని శివాజీ చౌక్ వద్దకు ఎమ్మెల్యే కాన్వాయ్‌లో వస్తుండగా స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇంతలోనే కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వాహనంపై కోడిగుడ్లు విసిరేందుకు ప్రయత్నించగా అవి పక్కన రోడ్డుపై పడ్డాయి. కాంగ్రెస్ నాయకుల కవ్వింపు చర్యలపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసుల జోక్యంతో రెండు పార్టీల వారు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ ఘటనపై దుబ్బాక బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి దొంగే .. దొంగ అన్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ సర్కారు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టు వ్యవహరిస్తున్నదని, అధికారంలో ఉన్నామనే సోయి తెచ్చుకుని బాధ్యతాయుతమైన పాలన అందించాలని హితవు పలికారు. దిగజారుడు రాజకీయాలు, ప్రతిపక్షాలను వేధించే రాజకీయాలు మానుకోవాలని కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు.



రుణమాఫీ చేయాలని కామారెడ్డి జిల్లా లింగంపేటలో ధర్నా చేస్తున్న రైతులు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

రుణమాఫీ పేరిట సర్కార్ వంచన

- సగం మందికి కూడా మాఫీ చేయలె
- మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్
- కామారెడ్డి జిల్లా లింగంపేటలో అన్నదాతల మహా ధర్నా

లింగంపేట, అక్టోబర్ 3: రుణమాఫీ పేరిట సర్కార్ రైతులు మోసగించిందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా లింగంపేటలో రైతులు గురువారం ఆందోళనకు దిగారు. షరతుల్లేకుండా రుణమాఫీ, రైతుభరోసా అమలు, పంటలకు బోనస్ ఇవ్వాలని కోరుతూ మహాధర్నా నిర్వహించారు. రైతుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ తీరుపై ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్న రేవంత్ 300 రోజులు దాటినా అమలు చేయలేదని విమర్శించారు. లింగంపేట మండలంలో 3,972 మంది రైతులకు గాను 1,400 మందికి మాత్రమే మాఫీ చేసి, మిగతా వారికి ఎగ్గొట్టారని మండిపడ్డారు. కాంగ్రెస్ హయాంలోనే హైదరాబాద్‌కు వలసలు వెళ్లిన ప్రజలు మూసీ పరీవాహక ప్రాంతాల్లో గృహాలు నిర్మించుకున్నారని.. ఆ రోజు ఎందుకు అడ్డుకోలేకపోయారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన పేరిట ముఖ్యమంత్రి రేవంత్.. కోట్ల రూపాయలను ఢిల్లీకి పంపేందుకు కుట్ర పన్నాడని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి సద్దులు, సంచులు మోయడానికే ఢిల్లీ వెళ్తున్నాడు తప్పితే అక్కడి నుంచి తీసుకువచ్చింది ఏమీ లేదని అన్నారు.

సెర్చ్ కమిటీ నుంచి నన్ను తప్పించండి

- ప్రొఫెసర్ హరగోపాల్ విజ్ఞప్తి
- ఆయన స్థానంలో మరొకరు
- నేడు 4 వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): కాకతీయ వర్సిటీ సెర్చ్ కమిటీలో తానుండలేనని, తనను సెర్చ్ కమిటీ నుంచి తప్పించాలని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్ విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు. రెండ్రోజుల క్రితం ఆయన లేఖ రాశారు. కేయూ సెర్చ్ కమిటీ సమావేశం శుక్రవారం జరుగనుండగా.. ప్రొఫెసర్ హరగోపాల్ అనాసక్తి వ్యక్తంచేయడంతో ఆయన స్థానంలో జేఎన్టీయూకు చెందిన ప్రొఫెసర్ దామోదరాన్ని సెర్చ్ కమిటీలో సభ్యుడిగా నియమించారు. ఈ అంశంపై హరగోపాల్ మాట్లాడుతూ.. తాము వద్దన్న వారినే వీసీలుగా ఎంపికచేస్తున్న తరుణంలో సెర్చ్ కమిటీల్లో ఉండి లాభమేంటని ప్రశ్నించారు. గురువారం ఉస్మానియా, పొట్టి శ్రీరాములు తెలుగు, పాలమూరు వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాలను సచివాలయంలో నిర్వహించారు. శుక్రవారం తెలంగాణ, జేఎన్టీయూ, శాతవాహన, కాకతీయ వర్సిటీల సెర్చ్ కమిటీ సమావేశాలు జరుగనున్నాయి.

విద్యా నిధుల్లో కోత తగదు

- విద్యా పరిరక్షణ కమిటీ ఆక్షేపణ

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక 7.3 శాతం మాత్రమే ఇచ్చిందని, ఇది ఏ మాత్రమూ సరికాదని రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ ఆక్షేపించింది. తమిళనాడులో 13.4శాతం, కర్ణాటకలో 12.9శాతం, కేరళలో 14.8 శాతం, ఏపీలో 12.6శాతం, దేశవ్యాప్తంగా సగటున 15శాతం నిధులిస్తే తెలంగాణలో కేవలం 7.3 శాతం నిధులిచ్చి చేతులు దులుపుకున్నారని పేర్కొంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యారంగంలో మార్పులపై గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఆశాస్త్రీయమైన ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో-25ను ఉపసంహరించుకోవాలని, 1-3 తరగతులను అంగన్‌వాడీలో కలిపే ఆలోచనను విరమించుకోవాలని, ప్రాథమిక పాఠశాలల్లోనే పూర్వ ప్రాథమిక విద్య బోధించాలని సమావేశంలో నిర్ణయించారు.

మాడల్ టీచర్లకు పదోన్నతులివ్వండి

- టీఎంఎస్‌టీఏ వినతి

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): మాడల్ స్కూళ్లలో పనిచేసే టీచర్లకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ స్టేట్ మాడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్(టీఎంఎస్‌టీఏ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూతం యాకమల్లు, కొంతం నగేశ్ గురువారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశాన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. మాడల్ స్కూళ్లు ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే కేడర్‌లో పనిచేస్తున్నామని, పదోన్నతులు కల్పించి నూతన నియామకాలు, 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించి కారుణ్య నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వివరాలివ్వండి

- అయా శాఖలకు ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ వాటి ఉపకులాలకు చెందిన ఉద్యోగుల వివరాలను అందించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఆదేశాలు జారీచేశారు. ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్) పోర్టల్‌లో ఉద్యోగుల వివరాలను అప్‌డేట్ చేసేందుకు కొత్త మాడ్యూల్ రూపొందించినట్టు తెలిపారు. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల క్యాటగిరీలో ఉప వర్గీకరణకు ఆయా రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ సముదాయాల ప్రాతినిధ్య నిష్పత్తి కోసం వివరాలను సేకరించాలని ఆదేశించింది. సుప్రీం ఆదేశం మేరకు వివరాలను ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో ఈ నెల 5వ తేదీలోగా పొందుపర్చాలని సుల్తానియా సూచించారు.

ఎన్‌పీఏ డైరెక్టర్‌గా అమిత్‌గార్గ్

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీ (ఎస్వీపీఎన్‌పీఏ) డైరెక్టర్‌గా ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 1993వ బ్యాచ్ ఐపీఎస్ అధికారి అమిత్‌గార్గ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎన్‌పీఏ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా కొనసాగిన ఆయనను పూర్తిస్థాయి డైరెక్టర్‌గా కేంద్ర హోంశాఖ నియమించింది.

మరో 3 రోజులు వానలు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో 3 రోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ- గద్వాల జిల్లాల్లో వానలు పడే అవకాశం ఉందని తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ-గద్వాలలో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

ఇక వాట్సాప్‌లో శ్రీవారి టికెట్లు

టీటీడీకి ఏపీ ప్రభుత్వం సూచన

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): సామాన్యులు సులభంగా తిరుమల శ్రీవారిని దర్శించుకునేలా ముందస్తు బుకింగ్ విధానాన్ని తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం యోచిస్తున్నది. టీటీడీలో వాట్సాప్ ద్వారా దర్శనం బుకింగ్ సేవలను ప్రారంభించి, తర్వాత అన్ని ఆలయాల్లోనూ ఈ విధానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఆలోచిస్తున్నది. శ్రీవారి దర్శనం కోసం సిఫార్సు లేఖల ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

నేడు తొర్రూరులో బీఆర్ఎస్ మెగా ధర్నా

- రుణమాఫీ అమలుపై ఎర్రబెల్లి నేతృత్వంలో పోరు
- రానున్న బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- ఏర్పాట్లను సమీక్షించిన ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు, అక్టోబర్ 3: రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ వర్తింపచేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కప్పదాటు వైఖరిని ఎండగడుతూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నేతృత్వంలో తొర్రూరులో శుక్రవారం భారీ ధర్నాకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో విఫలం కావడం, రుణమాఫీని పూర్తి స్థాయిలో అర్హులైన రైతులకు వర్తింప చేయకపోవడాన్ని నిరసిస్తూ తలపెట్టిన ధర్నాలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డితోపాటు పలువురు నేతలు ఈ ధర్నాలో పాల్గొననున్నట్టు మాజీ మంత్రి దయాకర్‌రావు తెలిపారు. గురువారం ఆయన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహాక సమావేశంలో మాట్లాడుతూ.. అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచేందుకు, రైతులకు ఇచ్చిన వాగ్దానం మేరకు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఓట్లు దండుకున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రుణమాఫీ అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ తలపెట్టిన ధర్నాకు దగా పడ్డ రైతులంతా పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

టార్గెట్ కేవీపీ రాంచందర్‌రావు!

- కాంగ్రెస్ సీనియర్ నేతపై రేవంత్ వ్యాఖ్యలు
- వివాదాస్పద స్థలంలో ఫాంహౌస్ ఉందని ఆరోపణ
- గతంలోనూ శశిథరూర్‌పై నోరుజారిన సీఎం
- ముఖ్యమంత్రి వైఖరిపై మండిపడుతున్న హస్తం నేతలు

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి సొంత పార్టీ సీనియర్ నేతపైనే విమర్శలు గుప్పించారు. వ్యక్తిగత మైలేజీ కోసం సీనియర్‌నేతను అభాసుపాలు చేశారని హస్తం నేతలు మండిపడుతున్నారు. కంటోన్మెంట్‌లో గురువారం నిర్వహించిన డిజిటల్ ఫ్యామిలీ కార్డుల పైలట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి మూసీ కూల్చివేతలు, హైడ్రాపై మాట్లాడారు. ఈ సందర్భంగా హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో అనేకమంది పెద్దలు ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్నారని అంటూ వారి పేర్లను ప్రస్తావించారు. బీఆర్ఎస్ నేతలతో పాటు, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రాంచందర్‌రావు పేరును ఆయన ఉదహరించారు. కేవీపీ అక్రమంగా ఫామ్‌హౌస్ నిర్మించుకున్నారని ఆరోపించారు. అనేక వివాదాస్పద ప్రాంతాల్లో అనేకమంది కాంగ్రెస్ నేతల నిర్మాణాలు ఉన్నా.. వారందరినీ వదిలిపెట్టి కేవలం సీనియర్ నేత కేవీపీ పేరునే ఉటంకించడం చర్చనీయాంశంగా మారింది. రాజకీయ మైలేజీ కోసమే సీఎం సీనియర్లకు అక్రమాలు అంటగడుతున్నారని హస్తం నేతలు మండిపడుతున్నారు. గతంలో నూ సీనియర్ నేత శశిథరూర్‌ను రేవంత్‌రెడ్డి.. 'ఆయన ఓ గాడిద. పార్టీ నుంచి బహిష్కరించాలి' అని వ్యాఖ్యానించారు. ఆ తరువాత వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్నారని గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత పల్లం రాజుకు చెందిన ఉస్మాన్‌సాగర్‌లోని ఫామ్‌హౌస్‌ను హైడ్రా కూల్చివేసింది. రేవంత్ మొదటి నుంచి సీనియర్ నేతల విషయంలో దుందుడుకుగా వ్యవహరిస్తున్నారని నేతలు మండిపడుతున్నారు.

సీనియర్ జర్నలిస్ట్ చిలుక ప్రవీణ్‌పై దాడి

- ప్రభుత్వానికి వ్యతిరేక వార్తలు ప్రసారం చేయొద్దని అల్టిమేటం
- బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

ఖైరతాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు ప్రసారం చేస్తున్నారనే అక్కసుతో సీనియర్ జర్నలిస్ట్ చిలుక ప్రవీణ్‌పై గుర్తు తెలియని దుండగులు గురువారం దాడి చేశారు. ఈ దాడి కాంగ్రెస్ మూకల పనేనని ఆరోపణలు వస్తున్నాయి. నగరం నడిబొడ్డున, ప్రగతి భవన్‌కు కూతవేటు దూరంలో ఈ దాడి జరగడం గమనార్హం. పంజాగుట్ట మొన్నప్ప జంక్షన్ సమీపంలో సీనియర్ జర్నలిస్ట్ చిలుక ప్రవీణ్ 'యూ' న్యూస్ పేరుతో యూ ట్యూబ్ చానల్ నిర్వహిస్తున్నాడు. గురువారం ఉదయం న్యూస్ చదివి స్నేహితుడు అజయ్‌తో కలిసి టిఫిన్ చేసేందు కు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఇంతలో 10-12 మంది గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి 'నీవే కదా చిలుక ప్రవీణ్' అంటూ ప్రశ్నించారు. అవుననే సరికి అతనిపై వి రుచుకుపడ్డారు. 'నువ్వు మారవారా?' అంటూ పిడిగుద్దులు గుద్దారు. అడ్డు వెళ్లిన అతని స్నేహితుడు అజయ్‌ను సైతం చితకబాదారు. ఈ దాడిలో గాయపడిన ప్రవీణ్‌ను చికిత్స నిమిత్తం యశోద దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా.. దుండగులు రెండు మూడు రోజుల నుంచి రెక్కీ నిర్వహించారు. బుధవారం ప్రవీణ్ ఆఫీసు వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. తమకు భూసమస్య ఉందని, దానిపై ఓ వార్త ప్రసారం చేయడం ద్వారా తమకు న్యాయం జరుగుతదని మాట్లాడారు. డాక్యుమెంట్లు తెచ్చారా అని ప్రశ్నించగా భిన్నమైన సమాధానాలు చెప్పి వెళ్లిపోయారని ప్రవీణ్ స్నేహితులు చెప్తున్నారు. వాళ్లే ఆఫీసును చూసి, ప్రవీణ్ ఎప్పుడు కిందకు వస్తాడు అనే వివరాలు సేకరిం చి దాడి చేశారని ఆరోపించారు. సోమాజిగూడలోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న ప్రవీణ్‌ను ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బూడిద భిక్షమయ్యగౌడ్, గ్యాదరి కిషోర్ పరామర్శించారు.

ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల, బూడిద భిక్షమయ్యగౌడ్, గాదరి కిశోర్, నాయకుడు పల్లె రవి తదితరులు

ట్రిపుల్ ఆర్ రైతులకు అన్యాయాన్ని సహించం

బాధితుల తరపున పోరాడుతాం: మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

చిక్కడపల్లి, అక్టోబర్ 3: ట్రిపుల్ ఆర్ విస్తరణలో రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని పలువురు వక్తలు స్పష్టం చేశారు. ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల రాజశేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, సీపీఎం నాయకుడు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సీతారాములు, రాష్ట్ర గీత కార్మిక ఆర్థిక సహకార సంస్థ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్, రైతు సంఘం నాయకుడు సాగర్ తదితరులు హాజరై మద్దుతు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు కోరుతున్న విధంగా ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగంలో 40 కిలోమీటర్లకు అలైన్‌మెంట్ మార్చాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ బాధిత రైతులకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని, వారు నిర్వహించే ప్రతి పోరాటానికి మద్దతు ఇస్తామని చెప్పారు. అలైన్‌మెంట్ మార్చకుంటే రైతులు కోట్లాది రూపాయిల విలువైన భూములు కోల్పోతారని తెలిపారు. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో కూడా చర్చిస్తామని చెప్పారు. ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎవరినీ కదిలించినా దుఖంలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. మాజీ ఎమ్మెల్యే పైళ్ల రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ గతంలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కి రైతులను మోసం చేసిందని విమర్శించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ భూమినే నమ్ముకొని జీవించే రైతులకు అన్యాయం చేయడం తగదన్నారు. రైతులు నిర్వహించే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని చెప్పారు. ఐక్యవేదిక నాయకులు దామోదర్‌రెడ్డి, బురుగ కృష్ణారెడ్డి, బండారు నర్సింహ, శ్రీశైలం, సుందర్ రెడ్డి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడు బలి

- 26 లక్షలు అప్పులు కావడంతో ఆత్మహత్య

నవీన్ (ఫైల్)

మిరుదొడ్డి, అక్టోబర్ 3 : ఆన్‌లైన్ బెట్టింగ్‌లో భారీగా డబ్బులు కోల్పోయిన యువ వ్యాపారి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారంలో గురువారం చోటుచేసుకున్నది. మిరుదొడ్డి ఎస్సై బీ పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రారం గ్రామానికి చెందిన ఇదారి నవీన్ (27) వ్యవసాయ సంబంధిత రసాయన ఎరువులు గ్రామంలో రైతులకు విక్రయిస్తుంటాడు. సులభంగా ఆదాయం సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసైన నవీన్ రూ.26 లక్షల వరకు అప్పు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురై గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు నవీన్‌ను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, రెండేండ్ల కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిరిసిల్ల పట్టణంలోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నేతన్నలు

ఉపాధి కోసం నేతన్నల ఆందోళన

- సిరిసిల్ల పట్టణంలో భారీ ధర్నా
- కాంగ్రెస్ సర్కార్ వచ్చినంక పనిలేక పస్తులే
- పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రమేశ్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల నేత కార్మికులు మరోమారు ఆందోళనకు దిగారు. ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బీవై నగర్‌లో చేనేత జౌళి శాఖ కార్యాలయం ఎదుట భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఎనిమిదేండ్లుగా బతుకమ్మ చీరల తయారీ ఆర్డర్లు ఇవ్వడం వల్ల వేలాది మంది కార్మికులకు చేతి నిండా పని లభించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బతుకమ్మ చీరల తయారీ నిలిపివేయడం వల్ల ఉపాధి పనిలేక అనేక కుటుంబాలు పస్తులు ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడ్డ వేలాది మంది కార్మికుల కుటుంబాలు నేడు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడ్డాయని తెలిపారు. కార్మికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. కార్మికులకు రావాల్సిన యార్న్ సబ్సిడీ బకాయిలు విడుదల చేయాలని పలుమార్లు కలెక్టర్, మంత్రులకు వినతి పత్రాలు సమర్పించిన స్పందించడం లేదని చెప్పారు. వెంటనే యార్న్ సబ్సిడీ విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, అన్నల్‌దాస్ గణేశ్, నక్క దేవదాస్, కూచన శంకర్, మల్లారెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.

ఇసుకాసురులతో పోలీసుల దోస్తీ!

- ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై 'వీఆర్ వేటు'
- ఇసుక అక్రమ రవాణా కట్టడిలో దారుణ వైఫల్యం
- పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకూ సాయం
- 'మైనర్' రేప్ ఘటనలో వికారాబాద్ సీఐ సస్పెండ్

హైదరాబాద్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ): లంచాల కోసం ఇసుకాసురులతో అంటకాగుతున్న ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలను వీఆర్‌కు అటాచ్ చేస్తూ గురువారం మల్టీజోన్-2 ఐజీ వీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో పెట్టినవారిలో సంగారెడ్డి రూరల్, తాండూర్ రూరల్, తాండూరు టౌన్ సీఐలతో పాటు.. వీపనగండ్ల, బిజినేపల్లి, తెలకపల్లి, వంగూరు, ఉప్పునూతల, సంగారెడ్డి రూరల్, పెద్దేముల్, యాలాల్, తుంగతుర్తి, ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, వాడపల